# హృదయం ప్రేమమయమైతే జీవితం ఆనందమయమౌతుంది

"దినకరుడు శాంతుడై తోచె, దినములింక కురుచలయ్యెను,
చలిగాలి చురుకు హెచ్చె, పొలములన్ రేయి గ్రుడ్డివెన్నెలలోన
కుప్పలన్ నూర్చు, కాపులు గొంతులెత్తి పదములన్ పాడదొడగిరి
పచ్చపూలు జనపచేలకు ముత్యాలసరులు గూర్చె,
మిరపపండ్లు కుంకుమ మెరుపు దాల్చె
బంతిపువ్వుల మొగములల్లంత విప్పి,
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
సరసురాలైన పుష్యమాసంబు వచ్చె,
సరసురాలైన సంక్రాంతి పండుగొచ్చె."

అన్ని పండుగలకన్న ముఖ్యమైనది సంక్రాంతి. నిజంగా భారతీయులకు ప్రతి దినమూ ఒక పర్వదినమే! కాని, తెలియనివారు పండుగలని ప్రత్యేకంగా విభజిస్తూ వచ్చారు. ఈనాడు ప్రతి ఒక్కరు గోవులను పూజిస్తారు. గంగిరెద్దుదాసు గంగిరెద్దుకు అనేక అలంకారములు చేసి, దుస్తులు వేసి, బజార్ల వెంబడి త్రిప్పుకొని వస్తుంటాడు. గంగిరెద్దుదాసు తానుకూడా ప్రత్యేకంగా అలంకారం చేసుకొని వస్తాడు. అతని రాక చిన్న పిల్లలకు ఎంతో ఉత్సాహం కలిగిస్తుంది.

"తమ్ముడా! రమ్ము గంగిరెద్దుదాసుడదిగో
వెండిబిళ్ళయు మొలత్రాడు దండకడెము

sri satyasaivachanamrutam

మోమునందు పంగనామములు, వెంట గంగిరెద్దు
చేత మునికోల తన పేరు చెప్పుచుండ
ఊరు నడివీధి నాడించె రమ్ము
వఱలు శ్రీరాములకు సీతమ్మనిచ్చి పెండ్లి గావించు
ఆ వేడ్క చూచి కానుకలిచ్చి వత్తము కదలిరమ్ము"

అంటూ అన్న తన తమ్ముణ్ణి వెంటపెట్టుకొని ఈ గంగిరెద్దుల ఆట చూడడానికి బయలుదేరుతుంటాడు. గంగిరెద్దుదాసు ఆవుకు సీత అని, ఎద్దుకు రాముడని పేర్లు పెట్టి వాటికి తగినరీతిగా తర్ఫీదు ఇచ్చి తీసికొని వస్తాడు. 'అమ్మా! రాముడంటే నీకు ఇష్టమేనా?' అని ఆవును ప్రశ్నిస్తాడు. అతనిచ్చిన తర్ఫీదు ప్రకారం ఆవు తనకిష్టం లేదంటుంది. తరువాత ఎద్దును ప్రశ్నిస్తాడు, "ఓ రామా! ఈ సీత నీకు ఇష్టమేనా?" అని. మొదట రెండూ వద్దంటాయి; కాని, తరువాత అంగీకరిస్తాయి. అప్పుడు రామునికి సీతనిచ్చి పెండ్లి చేస్తాడు. ఈవిధంగా, పశుపక్షిమృగాదులకు కూడా ఈ పండుగ ఎంతో ఆనందాన్నిస్తుంది. ఈ పండుగ జరుపుకోని ప్రాంతమే లేదు. అన్ని ప్రాంతములందు, అన్ని మతములవారు ఈ పండుగను జరుపుకుంటారు. అయితే, పేర్లు వేర్వేరుగా ఉండవచ్చును. ఇంతియేకాదు, సంక్రాంతి రైతులకు చాలా ముఖ్యమైనది. ఈ పండుగ వచ్చేసరికి రైతుల గృహాలు ధాన్యసంపదతో కళకళలాడుతుంటాయి. రైతులు ధాన్యమును తీసికొని ఇంటికి వచ్చినప్పుడు పిచ్చుకలు, గువ్వలు ఆ ధాన్యపు గింజలను తింటూ ఆనందమును అనుభవిస్తుంటాయి. కష్టపడి పనిచేసి మంచి పంట పండించినందుకు ఊరివారు రైతులను అభినందిస్తారు. రైతు మొదలుకొని రాజువరకు ప్రతి ఒక్కరికీ ఆనందాన్నిచ్చే పండుగ సంక్రాంతి. స్త్రీలు కూడా సంక్రాంతికి ప్రత్యేక స్థానము నందించి ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగకు క్రొత్త అల్లుడు అత్తవారింటికి వెళ్ళడం ఆనవాయితీ.

"అత్తవారింటికేగుమో కొత్త పెండ్లి కొడుక!
అందు నీకెక్కువ సుఖముగల్గు
ముద్దు మరదలు నీతోడ ముచ్చటాడు

sri sathyasai vachanamrutam

వదిన మాటికి నీతోడ వరుసలాడు
ఊరివారంత మన్ననలతిగ సల్ప
మామ కూడ నీదు అడుగులకు మడుగులొత్తు
పోయి రావయ్య అత్తవారింటికి నీవు"

అత్తమామలు అల్లునికి తగినరీతిగా గౌరవమర్యాదలు చేస్తారు; కొత్త బట్టలు పెడతారు; చక్కని విందు భోజనము ఏర్పాటు చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఆనందము నందించటమే ఈ పండుగయొక్క విశిష్టత. కాని, ఈనాడు సంక్రాంతి ఆనందము ఎక్కడికి పోయిందో తెలియదు. ఆనందంగా అత్తవారింటికి వెళ్ళవలసిన అల్లుడు కోపంతో కొట్లాడటానికి వెళుతున్నాడు. తమ ఆనందము నిమిత్తమై ఎదుటివారిని నొప్పించటం భారతీయుల లక్షణం కాదు. మనం ఎదుటివారి హృదయమును గుర్తించి వర్తించటం అత్యవసరం. అందరితో మన ఆనందాన్ని పంచుకోవాలి.

**అశాంతినుండి ప్రశాంతికి చేర్చేది సంక్రాంతి**

సంక్రాంతికి 'ఆనంద సుదినము'ని పేరు. ఈరోజున ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమౌతున్నది. క్రాంతి అనగా మార్పు. దుఃఖమునుండి ఆనందానికి మార్చేది సంక్రాంతి. అశాంతినుండి ప్రశాంతికి చేర్చేది సంక్రాంతి. కష్టమునుండి సుఖమును తెప్పించేది సంక్రాంతి. ఇవి చల్లటి రోజులు, రైతులు ఏ చింతలూ లేకుండా ఆనందంగా గడిపే రోజులు. పంటను కోసి ఇంటికి తెచ్చుకుంటారు కనుక, వారికి ఏ చింతా ఉండదు. 'చింత లేనివానికి సంతలోకూడా నిద్ర వస్తుంది' అని సామెత. మానవుడు చింత లేకుండా జీవించాలి. నిరంతరం ఆనందమును అనుభవించాలి. ఆనందమును ఆశించని మానవుడు ఈ జగత్తులో లేడు. అయితే, ఆనందము మన హృదయమునుండి ఆవిర్భవించునదేగాని, ప్రత్యేకముగా బయటి నుండి లభించేది కాదు. ఈనాటి మానవుడు అనుభవించే ఆనందము బాహ్యమైనదిగాను, కృత్రిమమైనదిగాను ఉంటున్నది. హృదయమునుండి వచ్చే ఆనందమే సహజమైనది, శాశ్వతమైనది. అది ఎలాంటి ఆనందం?

sri sathyasai vachanamrutam

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం...**

ఈనాటి మానవుడు ఆనందం నిమిత్తమై అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆనందం బయటినుండి కొనుక్కునేది కాదు; ప్రయత్నిస్తే లభించేది కాదు. ఆనందమును అనుభవించే నిమిత్తం దేహాభిమానమును త్యాగం చేయాలి. దేహం ప్రధానం కాదు, మనస్సు ప్రధానం కాదు. దేహం పాంచభౌతికము. మనస్సు కేవలం సంకల్పముల చేరిక. దేహాభిమానమును త్యాగం చేస్తే మనం ఎంతైనా ఆనందాన్ని అనుభవించవచ్చు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను దూరం నెట్టాలి. అంతర్ముఖమైన ఆనందమును, శాంతిని అభివృద్ధిపరచుకోవాలి. కాని, మానవుడు శాంతిని, ఆనందమును పెంచుకొనుటకు బదులు వాటిని త్రుంచుకుంటున్నాడు; చిన్నచిన్న పనులయందుకూడా అశాంతిని పొందుతున్నాడు. అశాంతిగాని, ప్రశాంతి గాని బయటినుండి వచ్చేవి కావు. "I want peace" (నాకు శాంతి కావాలి) అంటాడు మానవుడు. ఎక్కడుంది Peace (శాంతి)? బయటి ప్రపంచంలో Peace ఉంటే ఎంతైనా ధనము పెట్టి కొనవచ్చును. కాని, బయట ఉన్నది Peace కాదు, Pieces! నిజమైన శాంతి మీలోనే వున్నది. శాంతిని మీలోపల ఉంచుకొని బాహ్యప్రపంచంలో శాంతికోసం వెతకడం వెఱ్ఱితనం.

**ఎన్ని కష్టములు సంభవించినా పవిత్రతను, ప్రశాంతతను కోల్పోకూడదు**

మానవుని హృదయం చాలా పవిత్రమైనది, ప్రశాంతమైనది, ప్రకాశవంతమైనది. ప్రశాంతమైన హృదయంలో మనంతట మనమే అశాంతిని నింపుకుంటున్నాము. పాలయందు నీరు చేరి ఉంటుంది. నీరు చేరడంవలన పాలయొక్క తెలుపుదనం పోదు. పొయ్యిమీద పెట్టి కాచినప్పుడుకూడా పాలయొక్క తెలుపు పోదు. అదేరీతిగా, ఎన్ని కష్ట నష్టములు సంభవించినా మన హృదయం తన పవిత్రతను, ప్రశాంతతను, ప్రకాశమును కోల్పోకూడదు. తెలుపు హృదయానికి సంబంధించినది. అది పవిత్రతకు చిహ్నం. ఎన్ని దుఃఖములు సంభవించినా వాటిని అణగద్రొక్కి మనం ఆనందమును అనుభవించాలి.

srisathyasaivachanamrutam

కోపతాపములను కంట్రోలు చేసుకోవాలి. కోపం ఎందుకు వస్తుంది? తలచినవి నెరవేరినప్పుడు ఆనందం కలుగుతుంది. అభీష్టానికి విరుద్ధంగా జరిగినప్పుడు కోపం వస్తుంది. కాబట్టి, మొట్టమొదట మన కోరికలను అదుపులో పెట్టుకోవాలి. పాలను పొంగించినప్పుడు అవి చక్కగా పొంగుతాయి. కాని, మనం నీరు చల్లితే అణిగిపోతాయి. నీటితో చేరడంవలన పాలయొక్క విలువ తగ్గిపోతుంది. అదేవిధంగా, అల్పబుద్ధి గలవారితో సహవాసం చేస్తే మానవుడు అధోగతి పాలవుతాడు. కాబట్టి, మనం ఎవరితోనైనా స్నేహం చేసే ముందు వారు ఎటువంటివారు, మనకు ఏవిధమైన ఆనందమును అందిస్తారు, అనే ప్రశ్నలు వేసుకోవాలి. మనం మంచిగా ఉండాలి, సత్సంబంధాన్ని పెట్టుకోవాలి. మంచివారితో చేరినప్పుడు మనం ఎల్లప్పుడు ఆనందమునే అనుభవిస్తాము.

**ఆనందం మన ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నది**

విద్యార్థులారా! పర్వదినముల అంతరార్థమును మీరు గుర్తించి వర్తించడం అత్యవసరం. కాని, మీరు లోతునకు దిగి అర్థం తెలుసుకోలేక ఆనందానికి దూరమవుతున్నారు. ప్రతి మానవుడు నిత్యసత్యమైన ఆనందాన్ని ఆశించాలి. కష్టములయందుకూడా సుఖాన్ని పొందాలి. ఆనందముకోసం ఎక్కడో మనం వెతకనక్కర్లేదు. అది మన ఇంటనే, వెంటనే, జంటనే ఉంటున్నది. దానిని మీరెందుకు వదులుకుంటున్నారు? ఆనందముయొక్క తత్త్వాన్ని గుర్తించక, ఆనందముయొక్క రుచిని ఆశించక కేవలం ధన, కనక, వస్తు, వాహనాదులవలన కలిగే భౌతికానందమే నిజమైన ఆనందమని మీరు భ్రమిస్తున్నారు. ఆనందం మన హృదయము నుండి ఉప్పొంగాలి.

మీకు తెలుసునో లేదో కాని, నేను నిరంతరము ఆనందంగా ఉంటాను. నాకు విచారమనిగాని, కష్టమనిగాని, నష్టమనిగాని ఏ చింతా లేదు. "స్వామీ! మీకేమైనా Worry (చింత) ఉంటుందా?" అని అడుగుతారు కొంతమంది. Worry అంటే ఏమిటో నాకు తెలియదు. నేనెప్పుడూ ఆనందంగానే ఉంటుంటాను. మనం ఎక్కడికి పోయినా ఆనందాన్ని వెతకాలి, ఆనందాన్నే చూడాలి. ఆనందాన్నిగురించి చింతన చేస్తుంటే మనకు ఆనందమే కనిపిస్తుంది. ఆనందంలో ఉన్న రుచి మరి దేనియందూ లేదు. "చక్కెరకంటె తీపి,

srisathyasaivachanamrutam

దధిసారముకంటెను రుచ్యమౌను, పెంపెక్కిన తేనెకన్న అతి రుచ్యము". నిరంతరం ఆనందాన్నిగురించి ఆలోచిస్తే మనకు దుఃఖమనేదే ఉండదు. ఏ క్షణమునందూ నేను బాధలను లెక్కచేయను. కదిలిపోయే మేఘాలమాదిరి అవి వస్తుంటాయి, పోతుంటాయి. దుఃఖము పోతూనే ఆనందం వస్తుంది. ఆనందం పోతూనే దుఃఖము వస్తుంది. మనం ఆనందాన్ని వదలకుండా ఉండాలి. దుఃఖము వచ్చినప్పుడు ఆనందాన్ని తలచుకోవాలి. ఆనందం మనయందే ఉంటున్నది. ఎందుకు మనం విచారించాలి? దేహముగురించి విచారించాలా? అది నీటిబుడగ వంటిది. ఇక, మనస్సంటారా? అది ఎప్పుడూ చంచలమైనదే! Body is like a water bubble, mind is like a mad monkey. Don't follow the body, don't follow the mind. దేహసంబంధమైన కష్టములు, బాధలు ఎన్ని వచ్చినా వాటిని మీరు లెక్కచేయకండి. నీటిబుడగవంటి దేహముకోసం మనం ఎందుకు బాధపడాలి? ఇది వస్తుంది, పోతుంది. ఒక్కతూరి వచ్చిందంటే తిరిగి పోనిది జ్ఞానం. అట్టి జ్ఞానమును సంపాదించినప్పుడే నిజమైన ఆనందమును అనుభవించవచ్చును.

**సంతోషం బాహ్యమైనది, ఆనందం అంతర్ముఖమైనది**

ప్రేమస్వరూపులారా! మీలో ప్రేమ నిండుగా ఉన్నది. కాని, మీరు దానిని మూసిపెడుతున్నారు. ఆ ప్రేమకు ఒక పరిమితే లేదు. దానికి బంధనే లేదు. మీయందున్న ప్రేమను మీరు ప్రాపంచిక సంబంధమైన విషయాలలో ఉపయోగిస్తున్నారు. ప్రేమయొక్క రుచి మీకు తెలియదు. దైవాన్ని ప్రేమించండి. అదే నిజమైన ప్రేమ. ఎన్ని వచ్చినా, ఎన్ని పోయినా దైవము మాత్రం వచ్చేవాడూ కాదు, పోయేవాడూ కాదు. Happiness is union with God. భగవంతునితో ఏకమైనప్పుడే మీకు ఆనందం కలుగుతుంది; వేరుగా ఉంటే మీకు ఆనందం చిక్కదు. ప్రేమను పెంచుకోండి. ప్రేమతో జీవితాన్ని గడపండి. అప్పుడే మీ హృదయమునుండి ఆనందం ఉప్పొంగుతుంది. ఒక్కతూరి ఆనందం వచ్చిందంటే, అది పెరిగిపోతుందే గాని, తరిగిపోదు. హృదయానందమే నిజమైన ఆనందం. సంతోషమంటే 'Some - తోషం'. అది కేవలం బాహ్యమైనది; అప్పటికప్పుడు 'ఫ్లాష్' మాదిరి వస్తుంది,

పోతుంది. అది కాదు మనం కోరవలసింది. అంతర్ముఖంగా ఆనందాన్ని అనుభవించాలి. దీనికి వయస్సుతో నిమిత్తం లేదు. మీరు అనేకమంది చిన్నపిల్లలను చూస్తుంటారు. చిన్నపిల్లవానియొక్క హృదయం ఎంతో పవిత్రంగా ఉంటుంది. వానికి ఎట్టి చింతలూ ఉండవు. ఎదుటి మనిషి నవ్వితే తానుకూడా నవ్వుతాడు. అనగా, అందరియందున్న ఆనందం తనదే! ఎదుటి వ్యక్తి ఆనందంగా ఉంటే తానుకూడా ఆనందంగా ఉంటాడు. ఆ ఆనందం వాని హృదయమునుండి వచ్చేటటువంటిది. మీ హృదయాన్ని పవిత్రంగా పెట్టుకుంటే మీరుకూడా ఆనందంగానే ఉంటారు. ఈ జగత్తులో అన్నీ మార్పుచెందునవే! అట్టి మార్పుచెందేవాటిని మనం ఆధారం చేసుకోకూడదు. మార్పుచెందని దైవమును ఆధారం చేసుకోవాలి. ఒకవేళ దైవములోకూడా ఆనందం లేదనుకుంటే, అది మీయొక్క భ్రమ! భగవంతుడు ఆనందస్వరూపుడు. భగవంతుడు మీలోనే ఉండగా మీయందు దుఃఖము వచ్చి చేరడానికి అవకాశమే లేదు. మీరు దుఃఖిస్తున్నారంటే, అది మీ అంతట మీరు కొని తెచ్చుకున్నదే! ఉదాహరణకు, ఇది ఒక తెల్లని బట్ట. ఏ రంగులో ముంచితే ఇది ఆ రంగును పొందుతుంది. అదేవిధంగా, ఆనందమే మీ నిజస్వరూపము. మీరు దుఃఖమును అనుభవిస్తున్నారంటే, మిమ్మల్ని మీరు దుఃఖములో ముంచుకుంటున్నారన్నమాట.

**ఆశలవల్లనే మీరు ఆనందానికి దూరమవుతున్నారు**

కొంతమంది, 'స్వామీ! హ్యాపీ బర్త్‌డే!' అంటారు. బర్త్‌డేలో ప్రత్యేకంగా హ్యాపీనెస్ ఉందా? ఈ హ్యాపీనెస్ అనేది కేవలం కొనితెచ్చుకున్న పదమేగాని, నిజమైనది కాదు. నేను నిరంతరం ఆనందంగానే ఉన్నాను. ఆనందమే మన నిజస్వరూపం. కాని, మీ నిజస్వరూపాన్ని మీరు చూసుకోకుండా కృత్రిమంగా కల్పించుకున్న భౌతికానందమే నిజమైన ఆనందమని భ్రమిస్తున్నారు. భగవచ్చింతన చేయండి; శారీరకంగా, మానసికంగా, లౌకికంగా అన్నివిధాలుగా మీరు ఆనందంగా ఉండగలరు. పిచ్చిపిచ్చి ఆశలవల్లనే మీరు ఆనందానికి దూరమవుతున్నారు. ఈ పిచ్చి ఆశలను దూరం చేసుకోండి. (కర్చీఫ్‌ను చూపిస్తూ...) తెలుపు దీని స్వభావం. కాని, ఉపయోగించుకోవడంవలన కొంచెం నలుపైపోతుంది. అదేవిధంగా, మీ హృదయం సహజంగా పవిత్రమైనది. కాని, కోరికలచేత దానిని

srisathyasaivachanamrutam

మాలిన్యపరచుకుంటున్నారు. ప్రేమతో హృదయాన్ని నింపుకోండి; మీకు ఆనందం లేని క్షణమే కనిపించదు. చిన్నచిన్న కష్టాలకు క్రుంగిపోయి ఆనందాన్ని దూరం చేసుకోకూడదు. 'ఏమయ్యా, బాగున్నావా?' అని ఎవరైనా అడిగితే, 'ఆనందంగా ఉన్నాను', అని మీరు సమాధానం చెప్పాలి. ఆనందం హృదయమునుండి ఉప్పొంగి వచ్చేది. అది మీ అందరియందు ఉంటున్నది. ఒకతూరి నాదగ్గరకు రండి, చూడండి. ఎంత ఆనందం లభిస్తుందో! కాని, మీలో దుర్బుద్ధులు, దురాశలు పెట్టుకొని వస్తే ప్రయోజనం ఉండదు.

విద్యార్థులారా! మీరు దేనికీ చింతించకూడదు. ఒకవేళ మీరు పరీక్షలో ఫెయిలయ్యారనుకోండి. "నేను సరిగా రాయలేదు కాబట్టి, ఫెయిలయ్యాను. ఈసారి బాగా చదివి పాసవుతాను", అని మిమ్మల్ని మీరు ప్రోత్సహించుకోండి. అంతేగాని, 'అయ్యో, ఫెయిలైపోతినే' అని చింతించకూడదు. మీ సంకల్పములను సరియైనరీతిగా ఉంచుకున్నప్పుడు మీరు నిరంతరం ఆనందంగానే ఉంటారు. కష్టములు, దుఃఖములు కదిలిపోయే మేఘాల వంటివి. వాటిని చూసి మనం బాధపడకూడదు. ఎప్పుడూ మనం శాంతిగా, ఆనందంగా ఉంటుండాలి.

**కష్టాలు మానవులు కల్పించుకున్నవేగాని, దైవము కల్పించినవి కావు**

ప్రేమస్వరూపులారా! గడచిన నెలలో సముద్రం ఉప్పొంగి (సునామీ) అనేక దేశములవారిని దుఃఖానికి గురిచేసింది. ఇది మానవులు కల్పించుకున్నదేగాని, దైవము కల్పించినది కాదు. మానవుడు తన సంకల్పములచేతనే అనేక బాధలు అనుభవిస్తున్నాడు. కాబట్టి, ఇవన్నీ దైవము అందించినవని మనం చెప్పుకోకూడదు. దైవము ఎప్పుడూ మనకు ఆనందాన్ని అందించేవాడే! అందరినీ ప్రేమించేటటువంటివాడే! ప్రేమయే తన స్వభావము. అటువంటప్పుడు ఈ బాధలు ఎందుకు వస్తాయి? మానవుని కర్మలే ఇందుకు కారణం. కనుక, మీరు చెడ్డ పనులకు పాల్పడవద్దు. ఈ సంవత్సరంలో మున్ముందు ఇంకా కొన్ని 'ట్రబుల్స్' వస్తుంటాయి. కాని, వాటికి మనం తట్టుకొని నెట్టుకొని ముందుకు పోవాలి. ఇవన్నీ Passing clouds వలె వస్తాయి, పోతాయి. కాబట్టి, మనం ధైర్యంగా

sri sathyasai vahini

ఉంటుండాలి. ఏది జరిగినా మన మంచికోసమే అని దానిని స్వాగతించాలి. దుఃఖం లేక సుఖానికి విలువ రాదు. కష్టం లేక మానవునికి సుఖం లేదు. కష్టసుఖములు ఒకదానితో ఒకటి కూడి ఉంటాయి.

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వీని విడదీయ నెవ్వరి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటండ్రు**

భగవంతుడు నిర్దయుడని మీరు భావించకూడదు. భగవంతుడు ఎప్పుడూ కరుణామయుడే! ఈ సృష్టిలో ఎవ్వరినీ ఏవిధంగానూ బాధపెట్టడు. బాధలను మీకు మీరే కల్పించుకుంటున్నారు. భగవంతుడు సర్వ రక్షకుడు, సర్వులకు శాంతిని, ఆనందాన్ని అందించేటటువంటివాడు. 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అన్నదే భగవంతుని సంకల్పం. ప్రేమమయుడైన భగవంతుడు మీకు దుఃఖాన్నెలా అందిస్తాడు! ఈ సత్యాన్ని మీరు అర్థం చేసుకోలేక 'భగవంతుడు ఈ కష్టమును అందించాడు', అంటూ భగవంతునిపై నింద వేస్తున్నారు. దీనిని అర్థం చేసుకుంటే, అన్నీ మీ మంచికోసమే అని మీరు గ్రహించగలరు; ఆనందాన్ని అనుభవించగలరు. మీ హృదయంలో ఆనందాన్ని నింపుకోండి. ఆనందాన్నే సర్వులకు పంచండి. అప్పుడు ఆనందము మీలో మరింత అభివృద్ధి అవుతుంది.

**దుఃఖాన్ని అణగద్రొక్కాలి, ఆనందాన్ని బయటపెట్టాలి**

ప్రేమస్వరూపులారా! ఇది ప్రేమ సంక్రాంతి, ఆనంద సంక్రాంతి, అత్యద్భుతమైన సంక్రాంతి. ఇట్టి సంక్రాంతికి స్వాగతం పలకండి. ఆనందస్వరూపుడైన దైవానికి స్వాగతం పలకండి. 'కరుణానిధీ!', 'ప్రేమ స్వరూపా' వంటి పొగడ్తలతో భగవంతుడు సంతృప్తి చెందడు. భగవంతుడు ఆనందమయుడు. కనుక, "ఓ భగవంతుడా! నీ ఆనందమును నాకుకూడా అందించు", అని ప్రార్థించాలి. లౌకికమైన కోరికలు కోరకూడదు. మనకు కలిగే బాధలన్నీ మన మంచికోసమే అని భావిస్తే మీరెప్పుడూ ఆనందంగానే ఉంటారు. మీరు

srisathyasaivachanamrutam

ఆనందంగా ఉండి, ఆ ఆనందాన్ని పదిమందికి పంచి పెట్టండి. కాని, ఈనాటి మానవుడు ఆనందాన్ని మూసిపెడుతున్నాడు; దుఃఖాన్ని మాత్రం బయటపెడుతున్నాడు. అది కాదు మనం చేయ వలసింది. దుఃఖము, కష్టము, అశాంతి కలిగినప్పుడు వాటిని మనం ఏమాత్రము లెక్కచేయకూడదు. ఆనందాన్ని బయటపెట్టాలి, దుఃఖాన్ని అణగద్రొక్కాలి. ఇదే ఈనాడు మనం చేయవలసిన ఆధ్యాత్మిక సాధన. భగవంతుడు ఎప్పుడూ ఆనందమయుడే, కరుణామయుడే, దీనజన మందారుడే! ఈవిధంగా తలుచుకుంటే మీకు ఏమాత్రము బాధలు కలుగవు.

ప్రేమస్వరూపులారా! ఈ సంక్రాంతి మీ అందరి హృదయాలలో మంచి మార్పు కలిగించాలి. మీరు ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా కాలం గడపాలి. మీరు నిరంతరము మంచిని తలుచుకుంటూ ఉండండి. మీరు ఎల్లప్పుడు ఆనందంగానే ఉంటారు. మానవుడు ఆనందమయుడు. అదే అతనికి సరియైన పేరు. దానవత్వమును దూరం చేసుకొని దైవత్వమును అభివృద్ధిపరచుకున్నప్పుడే మానవుడు ఆనందమును అనుభవించగలడు. నిజంగా విచారణ చేస్తే చెడ్డ అనేది ఎక్కడుంది? మీకు మీరే చెడ్డను ఆలోచించి, చెడ్డను పెంచుకుంటున్నారు. ఆనందం ప్రతి ఒక్కరికీ ఆహారమే! ఆనందమనే ఆహారంకోసం మీరు నిరంతరం ఆకలితో ఉండాలి. ఆ ఆకలి అన్నం తినడంవలన తీరేది కాదు. మీరు ఆనందమును కోల్పోయినారు కాబట్టి, నిరంతరం ఆనందాన్ని కోరుకోండి. భగవంతునిపట్ల నమ్మకాన్ని దృఢం చేసుకోండి. భగవంతునియొక్క ప్రేమయే స్థిరమైనది. ఆ ఒక్కదానిని మీరు భద్రంగా పెట్టుకుంటే మీకు అన్ని ఆనందములూ లభిస్తాయి.

– శ్రీవారి దివ్యబోధ, తేదీ 14.01.2005 (సంక్రాంతి)

sri sathyasai vachanamrutam